రంజని - ఆది

నగుబాట్ల బడే - నా జిహ్వా
పగటున నిదివో - పావనమాయె

ఇల నందర నుతి - యించి పెంచువలె
నలినలియైనది - నా జిహ్వా
నలనోదరుశ్రీ - నామముదలచిన
ఫలమున కిదివో - పావనమాయె

భ్రమపడి మాయపు - పడతుల తమ్మల
నమలి చవులుగొనె - నా జిహ్వా
అమర వంద్యుడగు - హరిని నుతింపగ
ప్రమదముచవిగొని - పావనమాయె

నెలతల పలుయో - నిద్రవనదులను
నలుగడ నీదిన - నాజిహ్వా
అలసి వేంకటన - గాధిప యనుచును
పలికిన యంతనె - పావనమాయె

నా నాలిక ఉన్నదే అది నవ్వుల పాలైంది. పంచభూతాలూ నన్నుచూసి నవ్వుతున్నాయి అపహసిస్తున్నాయి. సంకీర్తనంవల్ల యిప్పుడు నా జిహ్వా పావనమైనది.

ప్రపంచములో ఎందరినో నరులను నుతించటం వల్ల నా రసనం రసహీనమైనది. పంచభూతాత్మకమైన ప్రకృతి నా అవస్థనుగని పరిహసిస్తున్నది. కమల నాభుడి శ్రీనామాలను స్మరించినంత మాత్రనే తత్పుణ్యఫలవశాత్ నాజిహ్వా పావనమైనది. రసపుష్టమైనది.

సంసారమనే మాయలో భ్రమించి, మోహవశాత్ కాంతల యెంగిలి తాంబూల చర్వణం తమకంతో ఒనర్చి నా నాల్క అపవిత్రమైనది. దేవాభినుతుడైన హరి సంకీర్తనం చేసినందున, హరినామ సంకీర్తనల రుచి మరిగినందున యిప్పుడు నా నాల్క పవిత్రమైనది.

ఎన్నెన్నో జన్మలలో ఎందరెందరో స్త్రీల గర్భకుహ రా ల్లో నివసించి వారి దేహాలలోని ద్రవములు ఆహారంగా స్వీకరించి మలినమైనది నా జిహ్వ. ఈ పునః పునర్జన్మల శ్రమచే అలసి 'వేంకటాచలపతీ' అన్నంతనే నాజిహ్వ పావనమైనది అని అన్నమాచార్యులు రసన పవిత్రీకరణ మంత్రాన్ని ఉద్వచించారు. హరినామ సంకీర్తనమే అపరిశుద్ధమైన మన నాల్కలకు పారిశుద్ధ్య ప్రక్రియ. శ్రీవేంకటేశ్వర స్తోత్రవచన పచనమే మన జిహ్వలకు శుచీకరణం. పుణ్యాహవాచనం.